క్లుప్తంగా

స్టూడెంట్ కిట్స్ పంపిణీ



కిట్లు అందుకున్న విద్యార్థులతో ఎంఈఓ నాగార్జునరెడ్డి

శిరివెళ్ల: మండలంలోని గోవిందపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు స్టూడెంట్ కిట్స్‌ను ఎంఈఓ నాగార్జునరెడ్డి పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ 2024–25 విద్యాసంవత్సరానికి సంబంధించి విద్యార్థులకు 43,091 పాఠ్య పుస్తకాలు, 30,744 నోట్ పుస్తకాలు, 3,620 బెల్టులు, 5,192 బ్యాగులు, 6108 డిక్షనరీలు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం బాలనాగిరెడ్డి, సీఆర్పీ పుల్లయ్య, టీచర్లు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు, ఇళ్ల స్థలాలపై దృష్టి సారించాలి



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీపీఐ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో నకిలీ విత్తనాలు అమ్మేవారిపై, పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీపై దృష్టి సారించాలని నూతన జిల్లా కలెక్టర్ రాజకుమారిని సీపీఐ జిల్లా బృందం కోరింది. మంగళవారం సీపీఐ నాయకులు జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కార్యదర్శి రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబాఫకృద్దీన్ మాట్లాడుతూ జిల్లాలో రహదారుల సమస్య, భూముల కబ్జాలు, తదితర వాటిని పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు సామేలు, సోమన్న, శ్రీనివాసులు, నాగరాముడు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

జగజ్జననీ మాతకు సారె సమర్పణ



అమ్మవారి ప్రతిమలు, సారె తీసుకెళ్తున్న మహిళలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని జగజ్జననీ నగర్‌లో వెలసిన జగజ్జననీ ఆలయంలో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని పట్టణ, గ్రామీణ ప్రాంతాల మహిళలు అమ్మవారికి చీర, సారెను భక్తి శ్రద్ధలతో సమర్పించారు. ఆలయంలో అమ్మవారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు నిర్వహించి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అమ్మవారి ప్రతిమను పుర వీధుల గుండా మేళతాళాలతో ఊరేగించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానాన్ని ఏర్పాటు చేశారు.

వైభవంగా అష్టాదళ పాదపద్మారాధన సేవ



శ్రీకాళికాంబ అమ్మవారికి అష్టాదళ పాదపద్మారాధన సేవ నిర్వహించిన దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన శ్రీ కాళికాంబా చంద్రశేఖర దేవస్థానంలో అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూల విరాట్‌కు ఉదయాన్నే సుప్రభాత సేవ, పంచామృత అభిషేకాలు, నిమ్మ, వేప రసాలచే ప్రత్యేక అభిషేకాలు చేపట్టారు. అనంతరం అమ్మవారినిపట్టు వస్త్రాలతో అలంకరించి వివిధ రకా ల పూలచే పూలంగి సేవా కార్యక్రమం నిర్వహించా రు. అమ్మవారికి ఒడిబియ్యం కార్యక్రమం నిర్వహించి, 108 వెండి పుష్పాలచే అష్టాదళ పాదపద్మారాధన సేవ నిర్వహించి మహామంగళ హారతులు ఇచ్చారు. అనంతరం అమ్మవారికి నవవిధ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయం ఈఓ లక్ష్మీనారాయణ, ఆరవేటి వాసు, విజయ్ కుమార్ తిమ్మయ్య, నరసింహ పాల్గొన్నారు.

కుమారస్వామికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

‘పది’ ఉత్తీర్ణత శాతం పెంచండి

- మధ్యాహ్న భోజన పథకాన్ని పటిష్టంగా అమలు చేయండి
- విద్యార్థులకు అన్ని వసతులు కల్పించండి
- జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు ఉపాధ్యాయులు, విద్యాధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో విద్యా వ్యవస్థ పనితీరుపై సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ అన్ని పాఠశాలల్లో నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం ఉపాధ్యాయులు సిలబస్‌ను సకాలంలో పూర్తిచేసి, ఉత్తీర్ణతా శాతాన్ని పెంచాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం అమలులో ఎలాంటి అలసత్వం లేకుండా మెనూ తప్పనిసరిగా పాటిస్తూ ఆహార పదార్థాలు విద్యార్థులకు ఇవ్వాలన్నారు. పాఠశాలల్లో మెనూ చార్ట్ తప్పనిసరిగా ప్రదర్శించడంతో పాటు వంటగది పరిశుభ్రత పాటించాలని సూచించారు. విద్యార్థులందరూ పాఠశాలలో మధ్యాహ్న భోజనం తీసుకునేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

ప్రతి పాఠశాలలో టాయిలెట్ సౌకర్యంతో పాటు తాగునీటి ఆర్‌ఓ ప్లాంట్లు కచ్చితంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులు పాఠశాల సమయంలో టాయిలెట్ కొరకు పాఠశాల ఆవరణ దాటి బయటకు వెళ్లకూడదని చెప్పారు. టాయిలెట్స్‌లో రన్నింగ్ వాటర్ ఉండేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు సరైన రీతిలో టాయిలెట్ వినియోగం గురించి అవగాహన కలిగిస్తూ పాఠశాలల్లో స్వచ్ఛతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. నాడు–నేడు పనుల కొరకు ఉపయోగిస్తున్న మెటీరియల్, కంకర, ఇటుకలు, రాళ్లు వంటివి పాఠశాల ఆవరణలో చిందర వందరగా కనిపించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మెటీరియల్ తరగతి గదులలో నిల్వచేసి, పిల్లలను బయట కూర్చోబెట్టడం సరి కాదని హెచ్చరించారు. ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు సరిపడే విధంగా గుడ్లు, చిక్కీల ఇండెంట్ ముందుగానే ఇవ్వాలన్నారు. పంపిణీ చేసిన స్టూడెంట్ కిట్స్ విద్యార్థులందరూ వినియోగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. యూనిఫామ్ ఇచ్చాక వారం రోజుల్లో కుట్టించుకుని పిల్లలు రెగ్యులర్‌గా యూనిఫామ్‌తో షూస్, బెల్ట్ తప్పనిసరిగా ధరించేలా తరగతి ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలని సూచించారు. సమావేశంలో డీఈఓ సుధాకర్ రెడ్డి, సమగ్ర శిక్ష అధికారి లలిత, పంచాయతీరాజ్ డీఈ రఘురామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఖనిజ సంపదను పరిరక్షించండి

జిల్లాలో అపార ఖనిజ సంపద ఉందని, అక్రమ రవాణా పాల్పడకుండా నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని గనుల శాఖ ఏడీ రామచంద్రను జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి ఆదేశించారు మంగళవారం కలెక్టర్ ఛాంబర్‌లో గనుల శాఖ ప్రగతిపై జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డితో కలిసి సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో లైమ్ స్టోన్, ఐరన్ ఓర్, డోలమైట్, నాపరాయి తదితర 15 రకాల ఖనిజ నిలువలు అపారంగా ఉన్నాయని, వీటి అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. జిల్లాలో రామ్‌కో, అల్ట్రాటెక్, పాణ్యం, జిందాల్, జయ జ్యోతి, రైన్ సిమెంట్ పరిశ్రమలు ఉన్నాయని గనుల శాఖ ఏడీ కలెక్టర్‌కు నివేదించారు. అలాగే జిల్లా మినరల్ ఫండ్ ట్రస్ట్ కింద రూ.365 కోట్ల రెవెన్యూ లక్ష్యాన్ని నిర్దేశించారని, ఇందుకు సంబంధించి రూ.280 కోట్లు లక్ష్యాన్ని సాధించామని తెలిపారు. కొలిమిగుండ్ల, బేతంచెర్ల, డోన్ చెక్ పోస్ట్‌లలో అక్రమ మైనింగ్ రవాణా చేస్తున్న వ్యక్తుల నుంచి రూ.50 లక్షల అపరాధ రుసుము వసూలు చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేస్తుందని, జిల్లాలో ఇసుక నిల్వలు స్టాక్ పాయింట్లు లేని కారణంగా సమీప జిల్లాలైన కర్నూలు, కడప, అనంతపురం జిల్లాల నుంచి ఇసుక రవాణా చేసుకోవాల్సి ఉంటుందని వివరించారు.

నిబద్ధతతో పనిచేయాలి

కలెక్టరేట్ కార్యాలయంలోని అన్ని సెక్షన్ల ఉద్యోగులు, సిబ్బంది క్రమశిక్షణతో, నిబద్ధతతో విధులు నిర్వహించి నాణ్యతతో పనులు చేయాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి సిబ్బందిని ఆదేశించారు. కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో అన్ని సెక్షన్ల సూపరింటెండెంట్లు, ఉద్యోగులతో సమీక్ష నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, డీఆర్‌ఓ పద్మజ తదితరులు ఈ సమీక్షలో పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహిస్తూ సామాన్య ప్రజలకు సేవలు అందించాలన్నారు. ఎవరెవరు ఏ ఏ విభాగాలలో పని చేస్తారో వివరాలు అడిగి తెలుసుకుంటూ సంబంధిత అంశాలలో దిశా నిర్దేశం చేశారు. ప్రధానంగా భూ సేకరణ విభాగం, లీగల్ సెల్, రెవెన్యూ అంశాలకు సంబంధించి డ్రాఫ్టింగ్ నిర్వహిస్తూ ప్రణాళిక బద్ధంగా విధులు నిర్వహించాలన్నారు. అనంతరం ఉద్యోగ సమస్యలను అడిగి తెలుసుకుంటూ పార్కింగ్ షెడ్డు, టాయిలెట్లు ఆర్‌ఓ ప్లాంట్లు, డైనింగ్ హాలు, పబ్లిక్ టాయిలెట్లు, ప్రధాన రహదారి నుంచి రోడ్డు సౌకర్య ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.

లైన్ క్లియర్



నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్

దొర్నిపాడు: ఎట్టకేలకు విద్యుత్ అధికారుల స్పందించి అస్తవ్యస్తంగా ఉన్న విద్యుత్ తీగెలను సరిచేసి లైన్ క్లియర్ చేశారు. 7వ తేదీన ‘గాలివీచిందా..కరెంట్ కట్’ శీర్షిక సాక్షిలో ప్రచురితమైంది. స్పందించిన ఏడీఈ ఖాజావలీ, ఏఈ రామ్మోహన్, లైన్‌మేన్ నాగన్న మంగళవారం నూతన విద్యుత్ స్తంభాలు వేయించారు. ఓసీ, ఎస్సీ కాలనీల్లో నెలకొన్న సమస్యను పరిష్కరించారు. దీంతో సర్పంచ్ శివరామిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

నేడు గోస్పాడులో ఉచిత గుండె వైద్య శిబిరం

గోస్పాడు: మండల కేంద్రమైన గోస్పాడులో బుధవారం ఉచిత గుండె వైద్య శిబిరాన్ని శాంతిరాం ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్థానిక దత్త సాయి మందిరంలో శిబిరం ఏర్పాటు చేసి ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. శిబిరం ద్వారా బీపీ, షుగర్, ఈసీజీ, టుడీ ఎకోతో పరీక్షలతో పాటు డాక్టర్ కన్సల్టేషన్‌ను ఉచితంగా ఉంటుందని, అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బ్రాహ్మణుల సమస్యలు పరిష్కరించాలి



ఎంపీకి వినతి పత్రం అందజేస్తున్న బ్రాహ్మణులు

నంద్యాల(వ్యవసాయం): జిల్లా బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం ఎంపీ బైరెడ్డి శబరికి జిల్లాలోని సమస్యల పరిష్కారం కోసం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య సభ్యులు వెంకటరామరాజు, సుబ్బారావు, నగరడోన సుధీర్ మాట్లాడుతూ నంద్యాల పట్టణంలో బ్రాహ్మణ భవన్ ఏర్పాటుకు స్థలం కేటాయించి నిర్మాణానికి సహకరించాలని, ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల హిందూ శ్మశాన వాటిక రహదారి ఆటంకాలను పరిష్కరించాలని కోరారు. అలాగే నందికొట్కూరు పట్టణంలో గాయత్రి దేవాలయంలో బ్రాహ్మణులకు కమ్యూనిటీ హాల్‌ను ఎంపీ నిధుల ద్వారా ఏర్పాటు చేయాలని, బ్రాహ్మణ అపర కర్మల భవనంపై మొదటి అంతస్తు నిర్మాణానికి ఆర్థిక సాయం అందజేయాలని విజ్ఞప్తి చేశారు. అదే విధంగా జిల్లాలోని ఎండోమెంట్ దేవాలయాలలో ఈసీ మెంబర్స్‌గా బ్రాహ్మణులకు స్థానం కల్పించి కాంట్రాక్ట్ బేసిక్ కింద మహిళలకు, పురుషులకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో బాల మురళీకృష్ణ, నాగేంద్రశర్మ, రాజశేఖర్, బ్రాహ్మణ సేవా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

చట్టాలపై మహిళలు అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న డాక్టర్ రుహుల్లాఖాన్

దొర్నిపాడు: నూతన చట్టాలపై మహిళలు అవగాహన పెంచుకోవాలని వైద్యాధికారి రుహుల్లాఖాన్ సూచించారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో మిషన్ శక్తి సంకల్ మహిళా సాధికారక కేంద్రం, భారతీయ న్యాయ సంహిత 2023 చట్టాలపై మహిళలకు అవగాహన కల్పించారు. బాలింతలు, గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. అనంతరం ఐసీడీఎస్ సూపర్ వైజర్ ప్రభాకరమ్మ ప్రధానమంత్రి మాతృవందన యోజనపై అవగాహన కల్పించారు.ఈ పథకం ద్వారా గర్భిణులకు ప్రభుత్వం రూ.6వేలు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రవికుమార్, పీహెచ్ఎన్ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో రైతులకు ప్రయోజనం



భూసార పరీక్షలకు మట్టిని సేకరిస్తున్న దృశ్యం

గోస్పాడు: భూసార పరీక్షలతో రైతులకు ప్రయోజనం చేకూరుతుందని రైతు శిక్షణా కేంద్రం అధికారి ఉమా, స్థానిక వ్యవసాయాధికారి స్వప్నికా రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని గోస్పాడులో భూసార పరీక్షలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ గోస్పాడు మండలంలో 504 భూసార పరీక్షలు చేయాల్సిన లక్ష్యం ఉందన్నారు. ఇప్పటికే కొన్ని చోట్ల పొలాల్లో పైర్లు సాగు అయ్యాయని తెలిపారు. పంట సాగు చేయని పొలాల్లో మట్టి పరీక్షలు చేయనున్నట్లు చెప్పారు. రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రానికి వచ్చి అగ్రికల్చర్ అసిస్టెంట్ సంప్రదించాలన్నారు. అలాగే కౌలు రైతులకు అర్హత గుర్తింపు కార్డులను అందజేయనున్నట్లు చెప్పారు. రైతులు ఆయా గ్రామాల్లో సంబంధించిన వీఆర్‌ఓ, అగ్రికల్చర్ అసిస్టెంట్లను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం భూసార పరీక్షల వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు.

గంగమ్మకు పూజలు

నంద్యాల(అర్బన్): ఏపీ రజక ఎస్సీ సాధన చైతన్య సమితి ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని చిన్నచెరువు కట్ట వద్ద గంగమ్మకు రజక సంఘీయులు వర్షాలు కురవాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమితి అధ్యక్షుడు శ్రీనివాసులు, మద్దిలేటి, ఆంజనేయులు, హనుమంతుల ఆధ్వర్యంలో పట్టణంలోని ఫారూక్‌నగర్, గుడిపాటిగడ్డ ప్రాంతానికి చెందిన రజకులు గంగమ్మను దర్శించుకొని మొక్కులు చెల్లించారు. సమితి అధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడుతూ రజకులకు ధోబీ ఘాట్లతో పాటు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు. అర్హులైన వారికి పింఛన్లు, నిరుద్యోగ భృతి చెల్లించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, మధు, నాగప్ప, తదితరులు పాల్గొన్నారు.



రజక కుటుంబాలతో కలిసి మాట్లాడుతున్న శ్రీనివాసులు

విద్యార్థులకు అభినందనలు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని భీమవరం రస్తాలో ఉన్న దారుల్ ఉలుమ్ సబిలుల్ హుదా మదరసాలో ఏపీఓఎస్ఎస్ ద్వారా పదో తరగతి, ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులకు మంగళవారం అభినందన సభ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథులు మదరసా కమిటీ అధ్యక్షులు ఖలీల్, నవభారత్ హుసేన్, హజరత్ అబ్దుల్ హాదీలు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ మదరసాలో విద్యార్థులకు హఫీజ్ ఖురాన్‌తో పాటు అర్హత గల విద్యార్థులకు ఏపీఓఎస్ఎస్ ద్వారా పదో తరగతి, ఇంటర్ పరీక్షలు రాయించడం అభినందించదగ్గ విషయమన్నారు. ప్రతి ఆదివారం తరగతులకు హాజరై పది, ఇంటర్ పూర్తి చేసిన 21 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. తక్కువ ఫీజుతో విద్యార్థులకు ఎస్ఎస్‌సీ, ఇంటర్ పూర్తి చేయించిన ఉపాధ్యాయులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ యాకోబ్, డాక్టర్ దస్తగిరి, అబ్దుల్‌హాదీ, అక్రమ్ అజరత్ జాకీర్ హుసేన్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసిన దృశ్యం

ప్రమాదకరంగా ప్రయాణం..!

నంద్యాల(సిటీ): నానాటికీ పెరిగిపోతున్న రోడ్డు ప్రమాదాలు చిన్న పాటి పొరపాట్ల వల్ల జరుగుతున్నాయి. నంద్యాల పట్టణంలో మంగళవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ఇనుప రేకులు, కడ్డీలతో వెళ్తున్న ట్రాలీ ఆటో తోటి ప్రయాణికులకు కాసేపు ఇబ్బంది కలిగించింది. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా వెళ్తున్నప్పటికీ పోలీసు అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. ఏవైనా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకున్నప్పుడు మాత్రమే అధికారులు స్పందిస్తారని, ముందస్తు జాగ్రత్తలు తీసుకోరని చర్చిస్తున్నారు.



రహదారిపై రేకులు వేసుకొని వెళ్తున్న ట్రాలీ ఆటో

అనారోగ్యంతో ఏఎస్ఐ మృతి



కృష్ణుడు (ఫైల్)

మహానంది: మహానంది పోలీస్‌స్టేషన్‌లో మూడేళ్ల పాటు ఏఎస్ఐగా పనిచేసి ప్రస్తుతం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఎస్ఐ కృష్ణుడు(57)అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనమృతి పట్ల ఎస్ఐ నాగేంద్రప్రసాద్, పోలీసు సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

బుడగ జంగాలకు సబ్ క్యాస్ట్‌లు ఇవ్వండి



తహసీల్దార్‌కు విన్నవిస్తున్న విద్యార్థిని లక్ష్మీప్రసన్న

నంద్యాల(అర్బన్): బుడగ జంగాల కులాల వారికి సబ్ క్యాస్ట్‌లు ఇవ్వాలని పలువురు బుడగ జంగాల నాయకులు కోరుతున్నారు. మంగళవారం పొన్నాపురం గ్రామానికి చెందిన లక్ష్మీప్రసన్న డిగ్రీ కళాశాలలో చేరేందుకు అవసరమైన కులధ్రువీకరణ పత్రం ఇవ్వాలంటూ స్థానిక సచివాలయంలో దరఖాస్తు చేసుకుంది. సచివాలయ సిబ్బంది బుడగ జంగం కులానికి సబ్‌క్యాస్ట్ చూపడం లేదంటూ తెలిపారు. దీంతో లక్ష్మీప్రసన్న తన తల్లిని వెంట పెట్టుకొని తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని సబ్ క్యాస్ట్ ఇవ్వాలని తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డికి మొర పెట్టుకుంది. గతంలో బుడగ జంగాలకు ఓసీ కులధ్రువీకరణ పత్రం ఇచ్చే వారని, ఇటీవల ఎస్సీ జాబితాలో చేర్చాలని కొందరు కోర్టుకు వెళ్లడంతో ఆన్‌లైన్‌లో సబ్ క్యాస్ట్ చూపడం లేదన్నారు. సమస్యను ఉన్నతాధికారులకు వివరించి రెండు మూడు రోజుల్లో పరిష్కారానికి కృషి చేస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

గేటు పడితే గంటల కొద్దీ ఆగాల్సిందే!

- నిత్యం రద్దీగా మూలసాగరం రహదారి
- రైళ్ల రాకపోకలతో తరచూ మూతపడుతున్న రైల్వేగేటు
- ఇబ్బందులు పడుతున్న వాహన దారులు
- ఫ్లైఓవర్ ఏర్పాటు చేయాలంటున్న ప్రజలు



మూలసాగరం గేటు వద్ద రైలు వస్తుండగా గేటు పడిన దృశ్యం



గేటు వేయడంతో ఎదురు చూస్తున్న వాహన దారులు

నంద్యాల(అర్బన్): నంద్యాల పట్టణం నుంచి మూలసాగరం మీదుగా బయటి ప్రాంతాలకు వెళ్లాలన్నా, పట్టణంలోకి రావాలన్నా వాహన దారులు, ప్రజలు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తుంది. పదుల సంఖ్యలో రైళ్లు, గూడ్స్‌లు గుంతల్లు–గుంటూరు ప్రాంతాలకు మూలసాగరం రైల్వే గేటు మీదుగా వెళ్లాల్సి ఉంది. ఎక్కడో దూరాన ఉన్న పాణ్యం, గాజులపల్లె దాటిన వెంటనే రైళ్లు వస్తున్నట్లు సిగ్నల్స్ రావడం, మూలసాగరం గేటు మూయడం పరిపాటిగా మారింది. ఆయా ప్రాంతాల నుంచి రైళ్లు నంద్యాలకు రావడం, నంద్యాల రైల్వే స్టేషన్ వదిలి వెళ్లే వరకు గేటు మూయడంతో నిత్యం భారీగా ట్రాఫిక్ నిలిచి పోతుంది. అత్యవసరాలు మీద వచ్చే వారు సైతం ఎదురు చూడాల్సిన పరిస్థితి వస్తుంది. మరి అత్యవసరమైన వారు పట్టణం నుంచి బొమ్మలసత్రం హైవే వంతెనపై నుంచి బయటకు వెళ్తున్నారు. అదే విధంగా పట్టణంలోకి వెళ్లే వారు వాహనాలను తిరిగి మళ్లించుకొని నూనెపల్లె ఫ్లై ఓవర్ మీదుగా పట్టణంలోకి వెళ్తున్నారు. రైళ్ల సంఖ్య పెరగడంతో సమస్య మరింత తీవ్రతరమైంది.

వంతెనలు ఏర్పాటు చేయాలని డిమాండ్

మూలసాగరం, పొన్నాపురం వద్ద ఫ్లై ఓవర్ వంతెన ఏర్పాటు చేయాలంటూ ఎన్నో ఏళ్లుగా ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నా సంబంధిత రైల్వే అధికారులు మాత్రం ఎక్కడ ఏర్పాటు చేయాలనే దానిపై తర్జన భర్జన పడుతున్నట్లు సమాచారం. పట్టణంలోకి వస్తున్న వారు బయటికి వెళ్తున్న వారు వేలాది మంది మూలసాగరం సెంటర్ పాయింట్‌గా ప్రయాణించాల్సి ఉంది. అరగంటకు ఒకసారి గేటు పడుతుండటంతో వందలాది మంది 15–20 నిమిషాల పాటు ఎదురు చూడాల్సి వస్తోంది. పొన్నాపురం సమీపంలోని లారీ అసోసియేషన్ కార్యాలయం వద్ద నుంచి పట్టణంలోకి వస్తున్న బైపాస్ రోడ్డు పొన్నాపురం కాలనీ సమీపంలో ఉన్న రైల్వే గేటు వద్ద వంతెన నిర్మాణం చేపట్టాలంటూ స్థానికులు కోరుతున్నారు.

కలగా మారిన అండర్‌పాస్ వంతెన..

నూనెపల్లెలో ఏర్పాటైన ఫ్లైఓవర్ బ్రిడ్జి ప్రాంతంలో అండర్‌పాస్ వంతెన నిర్మాణం కలగానే మిగిలింది. ఈ ప్రాంతంలో రైలు పట్టాలను దాటుకుంటూ వెళ్లేందుకు ప్రజలు, మూగజీవాలు ఇబ్బందులు పడుతున్నారు. బ్రిడ్జి సమీపంలో రైల్వేగేట్ లేకపోవడంతో రైలు వస్తున్న సమయం తెలియక పశువులు ప్రమాదాలకు గురైన సందర్భాలు ఉన్నాయి. అంతేగాకుండా వృద్ధులు పట్టాలు దాటుతూ కిందపడిన సంఘటనలు కోకొల్లలు. కోవెలకుంట్ల, ఆళ్లగడ్డ, గిద్దలూరు తదితర ప్రాంతాల ప్రజలు పట్టాలు దాటి పట్టణంలోకి రావాల్సి ఉంటుంది. ఈ విధంగా నిత్యం వేలాది మంది ప్రజలు, మేతకోసం వందలాది పశువులు పట్టాలు దాటుకుంటూ వెళ్తుంటాయి. త్వరలో ఎలక్ట్రిక్ రైళ్లు, ట్రాక్ డబులింగ్ అవుతుండటంతో మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ద్విచక్ర వాహనాలను మళ్లించుకోవాల్సి వస్తుంది



పట్టణం నుంచి మూలసాగరం వైపు వెళ్లాలంటే ఆలోచించాల్సిన పరిస్థితి ఉంది. రైల్వే గేటు ఎప్పుడు పడుతుందో, ఏ సమయానికి తీస్తారో తెలియక నిరీక్షించాల్సి వస్తుంది. చాపిరేవులకు వెళ్తున్న ప్రతిసారి నిరీక్షించే ఓపిక లేక టూవీలర్‌ను వెనక్కి తిప్పుకొని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఉన్న ఓవర్ బ్రిడ్జిపై నుంచి బొమ్మలసత్రం చేరుకోవాల్సి వస్తుంది. అత్యవసర సమయాల్లో ఎంతో మంది ఇబ్బందులు పడిన సందర్భాలు ఉన్నాయి. రైల్వే అధికారులు స్పందించి వంతెనను ఏర్పాటు చేయాలి.

–ఎల్లయ్య, చాపిరేవుల, నంద్యాల

మూలసాగరం వద్ద రైల్వే వంతెన ఏర్పాటు చేయాలి



రైల్వే గేటు వేసిన ప్రతి సారి వందలాది వాహనాలు గంటల తరబడి నిలబడాల్సి వస్తుంది. అత్యవసరాలకు కూడా గేట్లు ఎత్తే అవకాశం లేకుండా ఉంది. నిత్యం రద్దీగా ఉండే మూలసాగరం రైల్వే గేటు సమీపంలో ఫ్లై ఓవర్ వంతెన ఏర్పాటు చేయాలి. మూలసాగరం ఫ్లై వంతెన గురించి ఇప్పటికే పలుమార్లు ప్రజాప్రతినిధులను కోరాం. త్వరలో గ్రీన్ సిగ్నల్ వస్తుందని భావిస్తున్నాం.

– బషీర్, మూలసాగరం, నంద్యాల

కలెక్టర్‌ను కలసిన సాగునీటి సాధన సమితి నాయకులు

నంద్యాల(సెంట్రల్): కేసీ ఆయకట్టుకు ఎప్పటి నుంచి నీరు ఇస్తారో చెప్పలేని పరిస్థితి నెలకొందని, దీంతో రైతులు ఏ పంటలు సాగుచేయాలో, వేసిన పంటల పరిస్థితి ఏమిటో అర్థం కాని స్థితిలో ఉన్నారని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జ దశరథ రామిరెడ్డి అన్నారు. నంద్యాల జిల్లా కలెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన రాజకుమారిని మంగళవారం ఆమె ఛాంబర్‌లో సమితి సభ్యులతో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. జిల్లాలోని సాగునీటి వనరులు ప్రాజెక్టులను ఆమెకు వివరించారు. తాను రచించిన ‘నీటి అవగాహనే రాయలసీమకు రక్ష’ పుస్తకాన్ని కలెక్టర్‌కు అందజేశారు. కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షుడు వైఎన్ రెడ్డి, ఏరువా రామచంద్రారెడ్డి, మహేశ్వర్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, నిట్టూరు సుధాకర్ రావు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

కొత్తపల్లి: ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఉద్యోగావకాశాలు పొందేందుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ జవహర్‌బాబు మంగళవారం తెలిపారు. జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ద్వారా చెప్పులు తయారు చేసేందుకు ఉచిత శిక్షణ కార్యక్రమానికి అర్హులైనవారు ఏవరైనా ఉంటే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమం 45 రోజులు విజయవాడలో ఉంటుందని చెప్పారు. దరఖాస్తు చేసుకొనే వారు 21–40 సంవత్సరాల వయస్సువారై ఉండాలని వివరించారు. శిక్షణలో గృహవసతి, భోజనవసతితో పాటు ఉద్యోగం కల్పించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు స్థానిక సచివాలయాల్లో సంప్రదించాలన్నారు.